సాక్షి
అనంతపురం
ఆదివారం । 12 । మే । 2024



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



మరింత సంక్షేమాభివృద్ధి

ప్రజలకు మరింత సంక్షేమాభివృద్ధి అందిస్తామని ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ తెలిపారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.2°/ 23.7°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగింది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

ఓటు నీదే..భవితా నీదే

- వజ్రాయుధాన్ని జాగ్రత్తగా సంధించాలి..
- 'గతాన్ని' గుర్తుంచుకుని..వర్తమానాన్ని బేరీజు వేసుకోవాలి
- 'మరింత మంచి' కోసం, బంగారు భవిత కోసం 'విశ్వసనీయత' కల్గిన నేతకు పట్టం కట్టాలి
- అభ్యర్థుల గుణగణాలను దృష్టిలో ఉంచుకుని మరీ 'బటన్' నొక్కాలి



ఓటు వజ్రాయుధం. అత్యంత జాగ్రత్తగా సంధించాలి. 'గత' చేదు జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలి. వర్తమానాన్ని బేరీజు వేసుకోవాలి. భవిష్యత్తునూ దృష్టిలో ఉంచుకోవాలి. ఎవరు మేలు చేశారో, ఇక మీదటా చేస్తారో వారికే 'బటన్' నొక్కాలి. మనతో పాటు పిల్లల భవిష్యత్తును, 'పెద్దల' శ్రేయస్సునూ గమనంలో ఉంచుకోవాలి. మనందరి కోసం నిరంతరం తపించే నేతను ఎన్నుకోవాలి. గుణగణాలను గమనించి మరీ ఓటెత్తాలి. రేపటి మహా సంగ్రామం (పోలింగ్)లో మీరు సంధించే వజ్రాయుధం పేదలకు మేలు చేసేలా, పెత్తందారులు, వంచకులకు మరోసారి గుణపాఠం నేర్పేలా ఉండాలి. –సాక్షి, అనంతపురం

(అభ్యర్థుల గుణగణాలు)

అనంతపురం అర్బన్ అభ్యర్థులు

అనంత వెంకటరామి రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



- విశేష రాజకీయ అనుభవం
- నాలుగు సార్లు ఎంపీగా, ఒక సారి ఎమ్మెల్యేగా పనిచేశారు
- సౌమ్యుడు, మృదుస్వభావి
- గత ఐదేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు రూ.1,045 కోట్లు తీసుకొచ్చారు
- ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారు.
- పిలిస్తే పలికే నేత, అందరివాడిగా గుర్తింపు

దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ అభ్యర్థి



- పారిశ్రామికవేత్త కావడంతో హైదరాబాద్‌లో ఉండేవారు.
- టికెట్ కేటాయించడంతో కొన్ని రోజుల క్రితం అనంతపురం వచ్చారు.
- వైఎస్సార్ సీపీ నేత భూమిరెడ్డి ప్రసాద్ రెడ్డి హత్య కేసులో నిందితుడు
- రాప్తాడు ఎంపీపీగా పనిచేసిన సమయంలో నీరు– చెట్టు నిధులు కొల్లగొట్టినట్లు విమర్శలు

కళ్యాణదుర్గం అభ్యర్థులు

తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



- ఉన్నత విద్యావంతుడు. ఎస్కేయూలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.
- గతంలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేశారు.
- జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలతో సత్సంబంధాలు
- వివాదరహితుడు, బీసీ వర్గానికి చెందిన నేత
- ఎంపీగా జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ అభ్యర్థి



- బడా కాంట్రాక్టరు
- కళ్యాణదుర్గంతో ఎలాంటి సంబంధాలు లేవు
- ఎప్పుడూ తన పనుల్లో నిమగ్నమై తమను పట్టించుకోరని ప్రజల భావన
- అన్ని అంశాలను ఆర్థికంగానే చూస్తారనే అపవాదు
- కాంట్రాక్టరుగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే ఎమ్మెల్యేగా పోటీ చేశారని చర్చ

శింగనమల అభ్యర్థులు

వీరాంజినేయులు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



- అతి సామాన్య వ్యక్తి.
- టిప్పర్ డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకునేవారు
- ఉన్నత చదువులు చదివారు
- ఉన్నదాంట్లో ఇతరులకు సాయం చేసే గుణం
- అందరితో కలుపుగోలుగా ఉండే మనస్తత్వం
- ఇలాంటి వ్యక్తిని చులకన చేసి రాష్ట్రవ్యాప్తంగా చంద్రబాబు విమర్శలు మూటగట్టుకున్నారు

బండారు శ్రావణిశ్రీ, టీడీపీ అభ్యర్థి



- స్థానికంగా ఉండరు
- గత ఎన్నికల్లో టీడీపీ తరపున ఓటమి పాలయ్యారు.
- సొంత పార్టీ నేతలపైనే కేసులు నమోదు చేయించారనే అపవాదు
- ఈమె తండ్రి భూ కబ్జాలకు పేరు గాంచారు.
- భూమి కొట్టేసేందుకు ప్రయత్నించి ఓ దివ్యాంగురాలి ఆత్మహత్యకు కారణమయ్యారు.

రాయదుర్గం అభ్యర్థులు

మెట్టు గోవింద రెడ్డి, వైఎస్సార్‌సీపీ



- సుదీర్ఘ రాజకీయ అనుభవం
- ఒక దఫా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఏపీఐఐసీ చైర్మన్‌గా పనిచేశారు.
- నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడు
- సాయం చేసే గుణమే తప్ప కీడు చేయని వైఖరి
- పారిశ్రామికవేత్త కావడంతో నియోజకవర్గ ప్రజలకు అండదండగా ఉంటున్నారు.

కాలవ శ్రీనివాసులు, టీడీపీ అభ్యర్థి



- రాయదుర్గానికి వలస నేత
- గతంలో మంత్రిగా పని చేసినా నియోజకవర్గ అభివృద్ధికి చేసింది శూన్యం
- అధికారం మాటున సహజ వనరులను కొల్లగొట్టారనే ఆరోపణలు
- టీడీపీ హయాంలో తెలుగు తమ్ముళ్లతో కలిసి భారీగా అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు

తాడిపత్రి అభ్యర్థులు

కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ



- జేసీల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని ప్రజాశీస్సులతో ఎమ్మెల్యే అయిన ఘనత
- ఈయన వచ్చాక తాడిపత్రిలో శాంతి కుసుమాలు వెల్లివిరిశాయి
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు.
- స్వయంగా రైతు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో రైతులకు సాగునీరు అందించారు

జేసీ అస్మిత్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి



- తాడిపత్రికి వచ్చిపోయే అతిథిగా మాత్రమే గుర్తింపు
- అనేక కేసుల్లో నిందితుడు. ఏకంగా ఈడీ కూడా కేసు నమోదు చేసింది
- ఈయనకు ఓటు వేసినా తండ్రి జేసీ ప్రభాకర్ రెడ్డి అజమాయిషీ చేస్తారనే భయం ప్రజల్లో నెలకొంది
- గతంలో వీరి అరాచకాలను ఇంకా మరవలేదు.

ఉరవకొండ అభ్యర్థులు

వై. విశ్వేశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



- సౌమ్యుడు, ప్రజల పక్షాన పోరాటం చేసిన యోధుడు
- గెలిచినా, ఓడినా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.
- హంద్రీనీవా ఆయకట్టు రైతుల కోసం అనేక పోరాటాలు చేశారు.
- రైతుల పొలాలకు సాగునీరు, పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు.
- పేదల కోసం జైలుకు సైతం వెళ్లి వచ్చారు.

పయ్యావుల కేశవ్, టీడీపీ అభ్యర్థి



- గత ఎన్నికల్లో గెలిపించినా ప్రజలకు ఇన్నాళ్లూ అందుబాటులో లేరు.
- సొంత వ్యాపారాలపైనే దృష్టి పెడతారనే అపవాదు
- టీడీపీ హయాంలో గాలి మరల నిర్మాణం కోసం రైతుల నుంచి కారు చౌకగా భూములు కొనుగోలు చేసి కంపెనీలకు అధిక మొత్తంతో కట్టబెట్టారనే విమర్శలు

రాప్తాడు అభ్యర్థులు

తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ)



- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.
- సొంతంగా ట్రస్టు స్థాపించి ప్రజాసేవ చేశారు.
- రైతుల కోసం ఉచితంగా బోర్లు వేయించారు.
- నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం అమ్మ డెయిరీ స్థాపించారు.

పరిటాల సునీత (టీడీపీ)



- అవినీతి, అక్రమాలకు, దౌర్జన్యాలకు చిరునామాగా నిలిచిన కుటుంబం.
- మంత్రిగా ఉంటూ సొంత కుటుంబీకుల ఎదుగుదలకు పని చేశారు.
- వెనుకబడిన వర్గాలను అణగ దొక్కారు.
- నియోజకవర్గంలో అరాచక పాలన చేశారనే విమర్శలు ఉన్నాయి.

గుంతకల్లు అభ్యర్థులు

వై.వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి



- విశేష రాజకీయ అనుభవం, పేదలకు సేవ చేసే గుణం ఈయన సొంతం
- ప్రజల కోసం సొంత డబ్బుతో అంబులెన్సుల ఏర్పాటు
- గుంతకల్లులో రెండేళ్ల నుంచి రూ.6కే భోజనం అందిస్తూ పేదలకు చేరువ
- 30 సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను పూర్తి చేయించారు.

గుమ్మనూరు జయరాం, టీడీపీ అభ్యర్థి



- గుంతకల్లుకు వలస వచ్చారు.
- నాటుసారా తయారీ నుంచి మద్యం అక్రమ అమ్మకాలు, పేకాట స్థావరాల నిర్వహణ చేశారని ఆరోపణలు
- సొంత ఇలాకా ఆలూరులో సోదరులతో అకృత్యాలు చేయించారనే అపవాదు
- ఆలూరు వాసులే గుమ్మనూరుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు

ప్రచారం.. పరిసమాప్తం

- శనివారం సాయంత్రం 6 గంటలకు ముగిసిన ఎన్నికల ప్రచారం
- నయా జోష్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- రెండేళ్లకు పైగా జనంలోనే ఉన్న అధికార పార్టీ
- ప్రలోభాలను నమ్ముకున్న టీడీపీ అభ్యర్థులు



బుక్కరాయసముద్రం రోడ్‌షోలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం ఎడ్యుకేషన్: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల రోజులుగా హోరెత్తించిన మైకులు శనివారం సాయంత్రం ఆరు గంటలకు మూగబోయాయి.చివరి రోజు ప్రధాన పార్టీలు అనంతపురం పార్లమెంటుతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని జోరుగా సాగించాయి. మండే ఎండను సైతం లెక్క చేయలేదు. అనంతపురం పార్లమెంట్ స్థానానికి 21 మంది బరిలో నిలిచారు. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మాలగుండ్ల శంకరనారాయణ, టీడీపీ అభ్యర్థిగా అంబికా జి. లక్ష్మీనారాయణ. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లికార్జున వజ్జల, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బనాసి నారాయణప్ప పోటీలో ఉన్నారు. అలాగే రిజిస్టరు చేసిన రాజకీయ పార్టీల అభ్యర్థులు తొమ్మిది మంది, స్వతంత్ర అభ్యర్థులు ఎనిమిది మంది ఎన్నికల బరిలో నిలిచారు. 8 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 113 మంది బరిలో ఉన్నారు. ఎంపీ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల మధ్యే పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

నయా జోష్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు

ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రభుత్వం చేపట్టిన 'గడప గడపకూ వైఎస్సార్ సీపీ' కార్యక్రమంతో దాదాపు రెండేళ్లుగా అధికార పార్టీ ప్రజలతో మమేకమవుతూ వచ్చింది. కేవలం ఎన్నికల కోసమే కాకుండా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఇంటింటా తిరిగి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు చేస్తున్న అభివృద్ధిని వివరించారు. మరోవైపు ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నిత్యం ప్రజల మధ్యే తిరగడం ఆ పార్టీకి బాగా కలిసొచ్చే అంశం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడిపత్రి, కళ్యాణదుర్గం ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది. ఆయన సభలకు హాజరైన జనం చూసి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల గుండెలు గుబేల్‌మన్నాయి.

ప్రలోభాలను నమ్ముకున్న ప్రతిపక్షం

టీడీపీ పరిస్థితి దయనీయంగా ఉంది. అధికార పార్టీని ఎదుర్కొనేందుకు తంటాలు పడుతోంది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెప్పుకునే స్థాయిలో చేసిన పనులు లేకపోవడంతో ఇప్పుడు ప్రలోభాలను నమ్ముకుంది. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్లలో ఉద్యోగుల ఓట్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేసిన ఆ పార్టీ, సాధారణ ఓట్లను అదేవిధంగా కొనుగోలు చేసేందుకు వ్యూహం రచించినట్లు తెలిసింది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్లకు పెద్ద ఎత్తున డబ్బులు పంచడానికి తెర తీసింది. మద్యం ఏరులై పారిస్తోంది.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో ప్రధాన ఘట్టం పోలింగ్ ఈనెల 13 (సోమవారం) జరగనుంది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే ఓటు హక్కు వినియోగంపై జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తాడిపత్రి, రాయదుర్గం, తదితర నియోజకవర్గాల్లో స్వయంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ప్రజలను చైతన్యపరుస్తూ ర్యాలీలు నిర్వహించారు.

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్

సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహిస్తారు. ఎండలు అధికంగా ఉన్నాయి కాబట్టి ఓటర్లు వీలైనంత వరకు మధ్యాహ్నం 12 గంటల్లోగా ఓటు వేయడం ఆరోగ్య రీత్యా శ్రేయస్కరం. ఉదయం ఓటు వేయడం కుదరని వారు కొంత ఎండ తగ్గిన తరువాత ఐదు గంటలకు వెళ్లి ఓటు వేయడం శ్రేయస్కరం.

2,236 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిని 241 రూట్‌లుగా విభజించారు. 241 మంది సెక్టార్ అధికారులు పర్యవేక్షిస్తారు. అదనంగా 20 మందిని రిజర్వులో ఉంచారు. జిల్లావ్యాప్తంగా 20,18,162 మంది ఓటర్లు ఉండగా ఇందులో 21,400 మంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన వారు 13వ తేదీన వినియోగించుకోనున్నారు.

జిల్లాలో 12 ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు

ఎన్నికల్లో ప్రత్యేకంగా యువతకు, దివ్యాంగులకు, మహిళలకు 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 2,236 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఇందులో యువతకు రెండు పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగులకు రెండు, మహిళలకు సంబంధించి నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

- ఉరవకొండ పట్టణంలో 114 పోలింగ్ కేంద్రం (గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల)
- శింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రం మండలం పరిధిలోని 129 పోలింగ్ కేంద్రం (కొత్తపల్లి ఎంపీపీ పాఠశాల)

దివ్యాంగులకు..

- అనంతపురం నగర పరిధిలోని 231 పోలింగ్ కేంద్రం (మాంటిసోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్, గుత్తిరోడ్డు)
- శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండల పరిధిలోని 229 పోలింగ్ కేంద్రం (ఎంపీపీ పాఠశాల, చింతలపల్లి)

మహిళలకు..

- శింగనమల నియోజకవర్గం నార్పల మండల పరిధిలోని 170 పోలింగ్ కేంద్రం (ఎంపీపీ పాఠశాల, కేశేపల్లి)
- రాయదుర్గం పట్టణంలోని 187 పోలింగ్ కేంద్రం (ప్రభుత్వ ఉన్నత పాఠశాల)
- ఉరవకొండ పట్టణంలోని 130 పోలింగ్ కేంద్రం (కరిబసవస్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాల)
- గుంతకల్లు పట్టణంలోని 102 పోలింగ్ కేంద్రం (రోటరీ ఈఎం పాఠశాల, హనుమేష్ నగర్)
- తాడిపత్రి పట్టణంలోని 160 పోలింగ్ కేంద్రం (ఎంపీపీ పాఠశాల, కావేటిసముద్రం)
- అనంతపురం నగరంలోని 13 పోలింగ్ కేంద్రం (జెడ్పీ ఉన్నత పాఠశాల, తపోవనం)
- కళ్యాణదుర్గం పట్టణంలోని 60 పోలింగ్ కేంద్రం (ఎంపీపీ పాఠశాల నార్త్)
- రాప్తాడు నియోజకవర్గం చెన్నేకొత్తపల్లిలోని 252 పోలింగ్ కేంద్రం (జెడ్పీ ఉన్నత పాఠశాల)

కలెక్టరేట్‌లో లైజనింగ్ సెల్

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో లైజనింగ్ సెల్ ఏర్పాటు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తెలిపారు. వివరాలను శనివారం ఒక ప్రకటనలో వివరించారు. పోలింగ్‌కు ముందు 72 గంటల పాటు పాటించాల్సిన విధి విధానాలు తెలియజేసేందుకు, వారికి ఉన్న సందేహాల నివృత్తి కోసం కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల అనుసంధాన విభాగాన్ని (లైజనింగ్ సెల్) ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ పొందిన అధికారులు 24 గంటలూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి : ఎస్పీ

అనంతపురం: ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియలో స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ అమిత్‌బర్దర్ పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా చట్టబద్ధంగా మెలగాలని కోరారు. శనివారం సాయంత్రం 6 గంటలకు ఎన్నికల ప్రచారం ముగిసిందని, ఈ నెల 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకూ ఎలాంటి ప్రచారాలు, సభలు, ర్యాలీలు నిర్వహించకుండా అభ్యర్థులందరూ సహకరించాలన్నారు. అలాగే శనివారం సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు బంద్ చేయించామన్నారు. ఎన్నికల వేళ ఏమైనా సమస్యలు ఉంటే డయల్ -100కు లేదా జిల్లా పోలీస్ ఎన్నికల విభాగం ఫోన్ నంబర్ 939291829 కు తెలియజేయాలని కోరారు. కాగా, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ఆధారాలు లేకుండగా తరలిస్తున్న నగదు, బంగారు, వెండి ఆభరణాలకు సంబంధించి మొతతం రూ. 37.64 కోట్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో నగదు రూ.9.32 కోట్లు కాగా, రూ. 27.37 కోట్లు విలువ చేసే బంగారు, వెండి, రూ.10.23 లక్షలు విలువ చేసే గిఫ్ట్ సామగ్రి ఉందన్నారు. 734 లైసెన్స్ ఆయుధాలు ఉండగా, ఇందులో 658 ఆయుధాలను డిపాజిట్ చేశారన్నారు. మిగిలిన 76 ఆయుధాలు బ్యాంకులకు సంబంధించి సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉన్నాయన్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత కేసుల్లోని నిందితులు, కిరాయి హంతకులు, తదితరులకు సంబంధించి ఇప్పటి వరకూ 11,061 మందిని బైండోవర్ చేసినట్లు వివరించారు. 234 నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేశామన్నారు. 92 కేసుల్లో 1,048 లీటర్ల నాటుసారా ధ్వంసం చేశామన్నారు. కర్ణాటక మద్యం తరలిస్తున్న అంశంలో 550 కేసులు నమోదైనట్లు తెలిపారు.

పెన్నహోబిలంలో 20 నుంచి బ్రహ్మోత్సవాలు

ఉరవకొండ: జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో ఈ నెల 20 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను శనివారం ఆలయ ప్రాంగణంలో అర్చకులు, ఆలయ అధికారులు విడుదల చేశారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథచార్యులు, బాలాజీస్వామి మాట్లాడుతూ... ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకూ బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. 26న గరుడ వాహన సేవ, కల్యాణోత్సవం, 28న రథోత్సవం ఉంటాయన్నారు.

టీడీపీ నేత ఇంట్లో నగదు స్వాధీనం

గుత్తి: స్థానిక చెర్లోపల్లి కాలనీలో నివాసముంటున్న టీడీపీ నేత ఇంట్లో ఎలాంటి ఆధారాలు లేకుండా దాచిన రూ. 1.50 లక్షలను ఎఫ్ఎస్‌టీ సభ్యులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు నగదు సిద్ధంగా ఉంచినట్లు విచారణలో గుర్తించారు. నగదును గుంతకల్లు ఆర్‌ఓ శ్రీనివాసరెడ్డికి స్వాధీనం చేశారు.

హోరెత్తిన ప్రచారం


అనంతపురం రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) అభివాదం చేస్తున్న అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకట్రామిరెడ్డి

ఎన్నికల ప్రచారం శనివారం ముగిసింది. చివరి రోజు అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఎటు చూసినా జనాభిమానం పోటెత్తింది. గత 40 రోజులుగా భగభగమంటున్న సూరీడు సైతం జన ఉప్పెన చూసి కాస్త నెమ్మదించాడు. రోడ్‌షోలు ప్రజల్లో జోష్ నింపాయి. ఐదేళ్ల పాలనలో నిజమైన సంక్షేమాన్ని, అభివృద్ధిని చూశారని... మంచి చేసిన నాయకుడికే ఓటు వేయాలంటూ ఓ వైపు అభ్యర్థులు కోరుతూ ముందుకు సాగగా... మరో వైపు ప్రత్యర్థులు ఎందరున్నా.. మేమంతా సిద్ధమంటూ అనంత ప్రజలూ నినదించారు. – సాక్షి బృందం:


ఉరవకొండ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వ


కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు తిలకం దిద్దుతున్న మహిళ


రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరులో ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రోడ్‌షో


తాడిపత్రి రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి


తాడిపత్రి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి రోడ్ షోలో నృత్యం చేస్తున్న మహిళలు


గుంతకల్లు మండలం పులగుట్టపల్లి తండా వాసులతో కలసి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి వై. వెంకటరామిరెడ్డి


రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం సొల్లాపురంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, మెట్టు గోవిందరెడ్డి తరపున ప్రచారం చేస్తున్న స్థానికులు

ప్రశాంత పోలింగ్ నిర్వహణే లక్ష్యం

- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలి
- కేంద్ర బలగాల అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ అమిత్ బర్దర్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర బలగాల అధికారులకు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అమిత్‌బర్దర్‌తో కలసి సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్) కమాండెట్‌లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల్లో సీఏపీఎఫ్ బలగాల పాత్ర చాలా కీలకంగా మారిందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత పర్యవేక్షణ బాధ్యతను సీఏపీఎఫ్ బలగాలకు కేటాయించినట్లు తెలిపారు. పోలింగ్‌కు ముందు హింసాత్మక (పోస్ట్ పోల్ వైలెన్స్) ఘటనలు జరగకుండా చూడాలన్నారు. పోలింగ్ ఏజెంట్లు, మీడియా, అభ్యర్థులు, ఎన్నికల అధికారులకు అందించిన పాస్‌లను క్షుణ్ణంగా పరిశీలించి వారిని కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. సీఏపీఎఫ్ బలగాలకు తోడుగా క్విక్ రెస్పాన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యటిస్తూ ఉంటారన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారులు మాధవ్ ఉపాధ్యాయ్, ప్రశాంత్‌రాజ్, అభిషేక్ కుమార్, రుహాని, శైలజ, భూషరభాను, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, సీఏపీఎఫ్ కమాండెంట్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం 'సాక్షమ్'

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు 21 యాప్‌లను ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. పోలింగ్ నిర్వహణ, ఈసీ యాప్‌ల అంశంపై శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎస్ఐసీ డీఓఓ రవిశంకర్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తెచ్చిన యాప్‌లలో కొన్ని ప్రజల కోసం, ఇంకొన్ని అభ్యర్థుల కోసం, మరికొన్ని ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది కోసం ఉన్నాయన్నారు. ప్రధానంగా దివ్యాంగుల కోసం సాక్షమ్ యాప్ చాలా ప్రయోజకనకరంగా ఉందన్నారు. ఓట హక్కు వినియోగించుకునే అంశంలో దివ్యాంగులకు సాక్షమ్ యాప్ ద్వారా అభ్యర్థన పంపితే వెంటనే వారికి అవసరమైన సాయం అందుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ర్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. 546 వీల్ చైర్లు కొత్తవి అందుబాటులో ఉంచామన్నారు. ఏదేని సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరించేందుకు అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లు (ఏఎల్ఎంటీ) అందుబాటులో ఉంటారన్నారు. ఓటు వివరాలు తెలుసుకునేందుకు 'ఓటర్ హెల్ప్‌లైన్' యాప్ దోహదపడుతుందన్నారు. ప్రవర్తన నియమావళి ఉల్లంఘన, గొడవలు, డబ్బు, మద్యం పంపిణీ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే నేరుగా ప్రజలే సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పోలింగ్‌కు సంబంధించి పోల్ డే మానిటరింగ్ సిస్టం (పీడీఎంఎస్) యాప్‌ను అందుబాటులో ఉందన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం, పోలింగ్‌కు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ఈ యాప్ ద్వారా ప్రిసైడింగ్ అధికారి పంపాల్సి ఉంటుందన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ సజావుగా జరగాలి

పోలింగ్‌కు సంబంధించి సామగ్రి పంపిణీ ప్రక్రియను అదివారం సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సామగ్రి డిస్ట్రిబ్యూషన్ అంశంపై శనివారం కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఉదయం ఏడు గంటలకే ఎన్నికల అధికారులు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వచ్చేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బందికి టిఫిన్, భోజన వసతి కల్పించాలన్నారు. ఒక చోట నాలుగు పోలింగ్ కేంద్రాలు ఉంటే అన్నింటికీ మధ్యస్థానంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఆర్‌ఓ సురేష్‌రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మరింత సంక్షేమం, అభివృద్ధి

- నవరత్నాల ప్లస్‌తో పేదల జీవితాల్లో మరిన్ని వెలుగులు
- ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకర్ నారాయణ

సాక్షి ఇంటర్వ్యూ



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని వైఎస్సార్ సీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి ఎం.శంకర్ నారాయణ అన్నారు. దేశ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలు ముందుచూపుతో ఆలోచించి జగన్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. శనివారం తన నివాసంలో ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఎంపీగా అవకాశం కల్పిస్తే జిల్లాలో చేపట్టబోయే ప్రణాళికలను వివరించారు. ఆయన మాటల్లోనే..

నవరత్నాల ప్లస్‌తో మరింత ప్రగతి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ అమలు చేసిన 'నవరత్నాల' ద్వారా పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. 'అమ్మఒడి', 'చేయూత', 'కాపు నేస్తం' తదితర పథకాల ద్వారా అందించే మొత్తాన్ని పెంచడం ద్వారా మరింత ఆర్థిక ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఖరీదైన విద్య, వైద్యాన్ని మా ప్రభుత్వం ఉచితంగా అందించింది. అలాగే 'వైఎస్సార్ ఆసరా' ద్వారా సున్నా వడ్డీకే రుణాలు మంజూరు చేయించాం. రాష్ట్రంలో 33 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించాం.

పారిశ్రామికాభివృద్ధికి చర్యలు:

పరిశ్రమల ఏర్పాటుకు అనంతపురం జిల్లా అనుకూల ప్రాంతం. ఇప్పటికే ప్రభుత్వ చొరవతో అనేక పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఎంఎస్‌ఎంఈల ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగాయి. నేను ఎంపీగా గెలిచాక అనంతపురం నుంచి గుత్తి వరకు హైవేలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తా. రాయదుర్గం, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో టెక్స్‌టైల్ ఫాం ఏర్పాటు చేయిస్తా. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కేలా చేస్తా. జిల్లాలో మరిన్ని రోడ్లు నేషనల్ హైవే అథారిటీ పరిధిలోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటా. కేంద్ర ప్రభుత్వ చేయూతతో జిల్లా మీదుగా ఎక్కువ రైళ్ల రాకపోకలు సాగించేలా చొరవ తీసుకుంటా. ఉద్యాన పంటల రైతులకు మంచి గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటా. నేషనల్ హెల్త్ స్కీం(ఎన్‌హెచ్ఎం) పరిధిలో ఉండే ఆస్పత్రులను మరింత అభివృద్ధి చేస్తాం.

బాబు హామీలేమయ్యాయి?

2014 ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు 600 హామీలను ఇచ్చి ఒక్కటీ నెరవేర్చలేదు. ఇప్పుడు మళ్లీ సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నాడు. అప్పట్లో ఇచ్చిన హామీలేమయ్యాయని నేను ప్రశ్నిస్తున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం హామీలను నెరవేర్చారు. నవరత్నాల ద్వారా రూ.2.70 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసి పేదల బతుకులు మార్చారు. జగన్ మాట ఇచ్చారంటే అది తప్పక నెరవేరుస్తారు.

బీసీలకు పట్టం

బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక రాజకీయ ప్రాధాన్యత కల్పించారు. కేబినెట్‌లో 11 మంది బీసీలకు మంత్రులుగా అవకాశం కల్పించారు. మేయర్లు, మునిసిపల్ చైర్మన్లు, జెడ్పీ చైర్మన్లు, నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు అగ్రపీఠం వేశారు. నవరత్నాల ద్వారా ప్రభుత్వం ప్రజలకు అందించిన రూ.2.70 లక్షల కోట్లలో రూ.1.26 లక్షల కోట్లు బీసీలకే అందాయి. ఎన్నికలు సమీపిస్తున్నాయని ప్రతిపక్ష నేత చంద్రబాబు బీసీలపై కపట ప్రేమ చూపుతున్నాడు. ఆయన మాటలు నమ్మి టీడీపీకి ఓటు వేస్తే ప్రస్తుతం ప్రజలు అందుకుంటున్న సంక్షేమ పథకాలు పూర్తిగా రద్దు చేసేస్తాడు. ప్రజలు విచక్షణతో ఆలోచించి మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి.

మంచి చేసిన జగనన్నను గెలిపించండి

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



తాడిపత్రి: ప్రజలకు మంచి చేసిన జగనన్నను మరోసారి గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. శనివారం తాడిపత్రిలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విప్లవాత్మక సంస్కరణలతో విద్య, వైద్య రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద, ఇంగ్లిష్ మీడియం చదువులు, నాడు–నేడు కింద పాఠశాలలు ఆధునీకరణ, విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లు అందజేసి ప్రపంచ స్థాయిలో పోటీపడేలా నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. వైద్య రంగానికి విశేష ప్రాధాన్యతనిస్తూ 17 వైద్య కళాశాలలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆరోగ్యశ్రీ,, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలతో ఆరోగ్యాంధ్రప్రదేశ్‌ను సాక్షాత్కరింపజేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతలకు అండగా నిలిచారన్నారు. 3 లక్షలకు పైగా నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందజేశారన్నారు. ఆసరా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, 22 లక్షల గృహాలను నిర్మించడం వంటి పథకాలతో అక్క చెల్లెమ్మలకు బాసటగా నిలిచారన్నారు. మహిళల రక్షణకు దేశంలో ఎక్కడా లేని విధంగా దిశ యాప్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

'పెరిగిన' వైద్య కళాశాల పరపతి

- మెడిసిన్, ఆర్థోలో పీజీ సీట్ల పెంపు
- 112కు చేరిన సీట్లు


మెడిసిన్, ఆర్థో హెచ్‌ఓడీలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల పరపతి మరింత పెరిగింది. కళాశాలలోని పలు విభాగాల్లో పీజీ సీట్లు పెరిగాయి. మెడిసిన్ విభాగానికి కొత్తగా 4, ఆర్థో విభాగానికి నాలుగు పీజీ సీట్లను పెంచుతూ నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్య రావుకు మెయిల్ ద్వారా సమాచారం పంపింది. ఈ ఏడాది నుంచే కొత్తగా మంజూరైన పీజీ సీట్లు భర్తీ కానున్నాయి. తాజా పెంపుతో పీజీ సీట్ల సంఖ్య 112 కు చేరింది. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ మాణిక్య రావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు హర్షం వ్యక్తం చేశారు.

సంబరాలు..

పీజీ సీట్లు పెరిగిన నేపథ్యంలో వైద్య కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గతంలో జనరల్ మెడిసిన్ విభాగంలో ఐదు పీజీ సీట్లు ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య తొమ్మిదికి చేరిందన్నారు. అదేవిధంగా మూడు పీజీ సీట్లున్న ఆర్థో విభాగానికి మరో నాలుగు సీట్లు పెరిగాయన్నారు. గైనిక్ పీజీ సీట్లు మళ్లీ 12కు చేరుకున్నాయన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీల కృషే ఇందుకు కారణమన్నారు. వీటితో పాటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ విభాగానికి ఎండీ పోస్టు గ్రాడ్యుయేట్స్ సీట్ల మంజూరు కోసం నేషనల్ మెడికల్ కమిషన్‌కు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఆ రెండు విభాగాలకు పీజీ సీట్లు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ బీమసేనాచార్, ఆర్థో హెచ్‌ఓడీ డాక్టర్ ఆత్మారాం, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, ఎమర్జెన్సీ మెడిసిన్‌హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాసులు, ఎన్ఎంసీ బృందం సభ్యులు డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ పద్మశ్రావణి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ డాక్టర్ బీఎంఎస్ ప్రసాద్, ఆర్థో డాక్టర్ కోటి సతీష్, డాక్టర్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


కవాతు చేస్తున్న సీఐ శివరాముడు

కూడేరు: మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. శనివారం ఆయన కూడేరు, కరుట్లపల్లి, కలగ్ల, చోళసముద్రంతో పాటు మరికొన్ని గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ప్రజలతో సమావేశమయ్యారు.

గుత్తి రూరల్: మండలంలో సమస్యాత్మక గ్రామాలైన తొండపాడు, శ్రీపురం, మాముదూరు, అబ్బేదొడ్డి, జక్కలచెరువు గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. శనివారం కేంద్ర సాయధ బలగాలతో సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐలు నబీరసూల్, ఆశాబేగం ఆయా గ్రామాల్లో పర్యటించారు. సీఐ వెంకట్రామిరెడ్డి తొండపాడులో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించండి


ప్రచారం చేస్తున్న భీమలింగ, తదితరులు

గుత్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపి, ఆపార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ వై.భీమిలింగ కోరారు. శనివారం అబ్బేదొడ్డి, మాముడూరు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ప్రచారం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సునీల్, సంప త్, లాలెప్ప, నరశింహ, ఎర్రన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

వైవీఆర్‌ను గెలిపించండి


ఓటు అభ్యర్థిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: గుంతకల్లుకు రూ.1000 కోట్ల వ్యయంతో సోలార్‌పవర్ ప్రాజెక్టును మంజూరు చేయించిన ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని కోరారు. శనివారం 28, 32 వార్డుల్లో ఆమె ప్రచారం చేశారు. వార్డు నాయకులు పెయింటర్ హరి, అంజి, రహిమాన్, ఖాజా, దేవేంద్రనాయక్, రామాంజి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం


మాముడూరులో ప్రచారం చేస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం, మాముడూరు, ఊబిచెర్ల, బేతాపల్లి గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. ఎంపీగా శంకరనారాయణ, ఎమ్మెల్యేగా వై.వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. సర్పంచ్‌లు రామలింగమయ్య, చిన్న ఆంజనేయులు, ఎంపీటీసీ లాలెప్ప, నాయకులు మాజీ సర్పంచ్ తిమ్మారెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం


మాట్లాడుతున్న న్యాయవాదులు

గుంతకల్లు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని రాజ్యాంగాన్ని గౌరవించాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎంజీ భాస్కర్‌గౌడ్, న్యాయవాదులు బి.జయరాం, జి.రాము, వి.నాగరాజులు విజ్ఞప్తి చేశారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంతకల్లు: ఇంటర్ సిటీ ప్యాసింజర్ రైలులో శనివారం అక్రమంగా కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. నిందితుడిని గుంతకల్లులోని బెంచికొట్టాలకు చెందిన ఎం.జగదీష్‌గా గుర్తించారు. రైళ్లలో సమోసాలు అమ్ముకుని జీవనం సాగిస్తుండేవాడు. శనివారం ఉదయం బళ్లారిలో దాదాపు 49 మద్యం టెట్రా ప్యాకెట్లు కొనుగోలు చేసి, బకెట్‌లో కింది వేసుకుని పైన సమోసాలు పేర్చి విక్రయిస్తూ ప్రయాణం సాగిస్తుండగా అనుమానం వచ్చి సిబ్బంది తనిఖీ చేయడంతో అసలు బాగోతం బయటపడిందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి బాటలో గుత్తి మున్సిపాలిటీ


ప్రభుత్వాసుపత్రిలో నూతనంగా నిర్మించిన బిల్డింగ్


చెట్నేపల్లి అర్బన్ హెల్త్ సెంటర్


వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ కింద నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

గుత్తి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గుత్తి మున్సిపాలిటీ అభివృద్ధి బాట పట్టింది. మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి మిడ్ పెన్నార్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సీఎం రూ. 173 కోట్లు మంజూరు చేశారు. 70 శాతం వరకూ పనులు పూర్తయ్యాయి. మిగతా 30 శాతం పనులు పూర్తయితే గుత్తి మున్సిపాలిటీలో శాశ్వతంగా నీటి సమస్య పరిష్కారమవుతుంది. ఇంటింటికీ రోజూ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి చొరవతో సీఎం జగన్ గుత్తి మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ పనులకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. సుమారు రూ. 65 కోట్లతో వ్యవసాయ మార్కెట్ యార్డులో వైఎస్సార్ అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేశారు. రూ. 1.60 లక్షలు వెచ్చించి రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. గుత్తి ఆర్ ఎస్ చెట్నేపల్లిలో ఒకటి, గుత్తిలోని జంగాల కాలనీలో ఒకటి ఏర్పాటు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో సుమారు మూడు కోట్లు వెవెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్, వైద్యులు, నర్సులు, పేషంట్లకు సంబంధించిన రెండు కొత్త బిల్డింగులు నిర్మించారు. గుత్తి శివారులోని తాడిపత్రి రోడ్డులో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ కూడా పూర్తయింది. త్వరలోనే ఫైర్ స్టేషన్ ఏర్పాటు కానుంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు సంబంధించిన రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. కుక్కల బావి, కోట లో పార్కులు ఏర్పాటు చేశారు. మూడు చోట్ల జగనన్న కాలనీలు ఏర్పాటు అయ్యాయి. సుమారు నాలుగు వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇప్పటికే సుమారు రెండు వేల దాకా ఇళ్లు పూర్తయ్యాయి.


వైఎస్సార్ అగ్రి ల్యాబ్

నాణ్యమైన వైద్యం అందుతోంది



ప్రభుత్వాస్పత్రిలో మా లాంటి పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోంది. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే ఇష్టముండేది కాదు. ఇపుడు ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

–లక్ష్మీదేవి

గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలి


వజ్రకరూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్టీ విభాగం నాయకులు

వజ్రకరూరు: ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి, ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర నారాయణను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం నాయకులు ఓటర్లను కోరారు.శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండ ప్రాంతంలో ఎన్నోఏళ్లుగా అటవీభూములు సాగుచేస్తున్న గిరిజనులకు సాగు హక్కు పట్టాలు మంజూరుకు విశ్వేశ్వరరెడ్డి కృషి చేశారన్నారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించి గిరిజనులకు సాగుహక్కు పట్టాలు మంజూరు చేయాలని ఆదేశించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, గిరిజనులు వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం నాయకులు గోవిందునాయక్, తిరుమలేష్ నాయక్, శ్రీనివాసులునాయక్, ఎర్రిస్వామినాయక్, రూప్లనాయక్, చంద్రశేఖర్ నాయక్, రామకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే భావితరాల భవిష్యత్


గుంతకల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

- గుమ్మనూరుకు ఓటేస్తే గుంతకల్లు నాశనమే
- నియోజకవర్గాన్ని కాపాడుకుందాం
- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి


ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: సంక్షేమ పాలనకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచి భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే మార్గదర్శి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మిల్లు ఏరియాలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు ప్రతిరూపమైన టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరామ్‌కు పొరపాటును ఓటేస్తే ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన మన గుంతకల్లును మనమే నాశనం చేసుకున్న వాళ్లమవుతామన్నారు. అరాచకశక్తులుగా, దౌర్జన్యపరులుగా పేరు సంపాదించుకున్న ఇలాంటి వ్యక్తులకు ఓటేస్తే గల్లీకో బెల్ట్‌షాప్..వీధికో పేకాట క్లబ్ రావడం ఖాయమన్నారు. బీసీ వర్గానికి చెందిన వ్యక్తి అని ఐదేళ్ల పాటు మంత్రి పదవిలో కొనసాగించిన కన్నతల్లి లాంటి వైఎస్సార్‌సీపీకే ద్రోహం చేసిన నీచుడు గుమ్మనూరు అని ఆయన మండిపడ్డారు. ఆలూరు తరహాలో ఇక్కడ తొడలు కొట్టడాలు, మీసాలు తిప్పడాలు చేసిన గుమ్మనూరు సోదరులకు ఓటు రూపంలో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగనన్న చేసిన మంచిని, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని పరిశీలించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా శంకర్‌నారాయణ, ఎమ్మెల్యేగా తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగమ్మ, వార్డు ఇన్‌ఛార్జి శేఖర్, నాయకులు కుందా రాఘవేంద్ర, విజయ్, గోపాలక్రిష్ణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ పార్టీకి అండగా నిలిచి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన మండలంలోని పులగుట్టపల్లి, పులగుట్టపల్లి పెద్దతండా, చిన్నతండా గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల గుండెలో చెరగని ముద్ర వేసుకున్నామన్నారు. కళ్లబొల్లి హామీలతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో మరోసారి సిద్ధమయ్యారని, వారి మాయలో పడొద్దన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను నేరుగా గుమ్మం వద్దకే చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శంకర నారాయణను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, సచివాలయ మండల కన్వీనర్ గోవిందు నాయక్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఎమ్మెల్యే పయ్యావులను సాగనంపండి


ఉరవకొండ రోడ్‌షోలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి


విశ్వేశ్వరరెడ్డికి హారతులు పడుతున్న మహిళలు

ఉరవకొండ: ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలకు కనిపించి, గెలిచిన తర్వాత నగరాలకు పరిమితమయ్యే పార్ట్‌టైం ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారం చివరి రోజున ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈకార్యక్రమానికి వేలాది జనం, పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో ఉరవకొండలో ఇసుకేస్తే రాలినంత జనంతో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెప లాడాయి. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై, ర్యాలీ పాత బస్టాండ్, పాతపేట, జైనబ్బీదర్గా, గాంధీబజార్ మీదుగా కామన్నకట్ట, పదవవార్డు, అంబేడ్కర్‌గనర్, ఇంద్రానగర్, డ్రైవర్స్ కాలనీల మీదుగా సాగింది. స్థానిక కవితా హోటల్ సర్కిల్ వద్ద పార్టీ యువనేత వై.ప్రణయ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను అందించారన్నారు. సంక్షేమ పాలన తిరిగి కొనసాగడానికి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. దగాకోరు కూటమి పార్టీలను నమ్మి వారి మ్యానిఫెస్టోను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్డెషేక్షావలి, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, బసవరాజు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నా భర్త విశ్వేశ్వర రెడ్డిని గెలిపించండి

కూడేరు: అధికారంలో ఉన్నా..లేకున్నా నిత్యం ప్రజల కోసం తపించే నా భర్త విశ్వేశ్వరరెడ్డిని ఈనెల 13న ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని భువనేశ్వరి ఓటర్లను కోరారు. శనివారం ఆమె కూడేరు విఘ్నేశ్వర, సంగమేశ్వర కాలనీతో పాటు మరికొన్ని కాలనీల్లో విశ్వేశ్వర రెడ్డి గెలుపునకు ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాళ్లు వెంకటలక్ష్మమ్మ, ఓబుళమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్విని, సర్పంచ్ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీలు సుబ్బమ్మ, దేవ, పార్టీ నేతలు విజయ భాస్కర్ రెడ్డి, శంకర్ రెడ్డి, రామదుర్గం క్రిష్టప్ప, హరిజన సంగప్ప, సర్దార్ వలి, శంకర్ నాయక్, రామాంజనేయులు, ఎర్రనాగప్ప, కొండా, శివ, వేణు, శ్రీకాంత్, వసంత, గీతమ్మ, శీనా నాయక్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.


ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న విశ్వ సతీమణి భువనేశ్వరి

10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలో చివరిరోజు ప్రచారంలో భాగంగా 10 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సమక్షంలో ఆ గ్రామ ఆదర్శరైతు జేజప్పగారి రసూల్ కుటుంబంతో పాటు మరి కొన్ని కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు ఆకర్షితులమై పార్టీలోకి చేరామన్నాయి. జగనన్నను మరోసారి సీఎం చేసుకోవడంతోపాటు ఎమ్మెల్యేగా వై వెంకట్రామిరెడ్డిని, ఎంపీగా శంకరనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, నరసింహ, చెన్నకేశవులు, మస్తాన్, మాబు తదితరులు పాల్గొన్నారు.


జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న దృశ్యం

గ్రామాల్లో విస్తృత ప్రచారం


జల్లిపల్లిలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నేత


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ప్రణయ్‌రెడ్డి

వజ్రకరూరు: మండలంలోని పందికుంట, వజ్రకరూరు, బోడిసానిపల్లి, పీసీ ప్యాపిలి తదితర గ్రామాలతోపాటు అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రచారం చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరెడ్డి, ఎంపీగా శంకరనారాయణను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీ పీ యువజన విభాగం నాయకుడు శశాంక్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుంకమ్మ, ఎస్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, సర్పంచులు మోనాలిసా, ఉమామహేశ్వరి, జ్యోతి బాయి, నా యకులు రవికాంతరెడ్డి, ఎర్రిస్వామి, మున్నా,రత్నశేఖర్, వెంకట్రామిరెడ్డి, మీసాల సుంకన్న, హిమ వంత్‌రాజు, బాణేనాయక్, కిష్టప్ప, చంద్రానాయక్, ప్యాపిలి వీరా, అర్జున్, రమేష్, మాబుసాబ్, ఓబుళేసు, విజయ్‌కుమార్‌నాయక్, భీమా పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు.

విడపనకల్లు: మండలంలోని వి.కొత్తకోట, గడేకల్లు పాల్తూరు, విడపనకల్లు, పొలికి, చీకలగురికి, ఉండబండ, డొనేకల్లు, కడదరబెంచి తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ప్రచారం చేశారు. గడేకల్లులో గడేకల్లులో ఎంపీపీ కరణం పుష్పావతి, భీంరెడ్డి, సర్పంచు సుశీల, ఎంపీటీసీలు ఓబుళేసు, ప్రసాదు, ఉమాశంకర్ హంపయ్య, హేమంత్ ప్రచారం చేశారు. వి.కొత్తకోటలో మండల అగ్రిబోర్డు చైర్మన్ భీంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, చిట్టిబాబు, వీరప్ప, ఎంపీటీసీ తిమ్మరాజు, హనుమంతు యాదవ్ ప్రచారం చేశారు. పాల్తూరులో మాజీ వైస్ ఎంపీపీ ఓబుళేసు, ప్యాపిలి నాగరాజు, ఎంపీటీసీలు దాసరి వెంకటేశులు, శివగౌడు,నల్ల సుంకన్న, డిష్ వెంకటేశులు ప్రచారం చేశారు. పొలికిలో గాజుల చిన్న వెంకటేశులు,పెద్ద వెంకటేశులు, అంగడి శీనా,మాధవరెడ్డి, మనో విశ్వాస్‌రెడ్డి, వరదారెడ్డి ,నాగిరెడ్డి ప్రచారం చేశారు. హంచనహాళ్, విడపనకల్లు, డొనేకల్లు, కరకముక్కల, హావళిగి, గాజుల మల్లాపురం,పెద్ద కొట్టాలపల్లిలో ప్రచారం చేశారు. విడపనకల్లులో మాజీ సర్పంచు దేశాయ్ చంద్రనాథ్, బీసీ సెల్ నాయకులు బోయ నాగేంద్ర, కురుబ గిరిబాబు, ఎస్సీసెల్ నాయకులు సుంకన్న, ఉలిగన్న, యువరాజు నాగరాజు, నాగేంద్ర, మైనార్టీ నాయకులు రియాజ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వర రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, మండల నేత గడ్డం సిద్ధారెడ్డి, పార్టీ నేతలు శనివారం ప్రచారం చేశారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక: జల్లిపల్లికి చెందిన టీడీపీ నేత గొల్ల అంజనయ్యతో పాటు పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, పార్టీ నేత గడ్డం సిద్ధారెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

వజ్రకరూరు: చాబాలలో ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు గణేష్ యాదవ్‌తోపాటు మరో 40 మంది వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వీరిని యువనేత ప్రణయ్‌రెడ్డి పార్టీలోకి చేర్చుకున్నారు. సర్పంచు మల్లెల జగదీష్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణప్ప, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి వశికెర రమేష్, సీనియర్ నాయకుడు రామచంద్ర, తదితరులు ఉన్నారు.


హనిమరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు


పందికుంటలో ప్రచారం చేస్తున్న నాయకులు


ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బెళుగుప్ప: ఎన్నికల పోలింగ్ నాడు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను ఉరవకొండ నియోజకవర్గ ఎన్నికల అధికారి కేతన్‌గార్గ్ హెచ్చరించారు. బెళుగుప్పలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం కనబరుస్తున్న ఇద్దరు బీఎల్‌ఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరినాథ్‌రావు, ఎంపీడీఓ సుబ్బరాజు, ఏఓ పృథ్వీసాగర్, పీఆర్ జేఈ సుధాకర్, ఈఓఆర్డీ మాధవరెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.


బీఎల్‌ఓలను హెచ్చరిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తా

- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి



సాక్షి ఇంటర్వ్యూ

ఉరవకొండ: తనకు ప్రజాసేవే పరమావధి, ఎమ్మెల్యేగా గెలవకపోయినా నిత్యం ప్రజల్లోనే ఉంటూ, వారి సంక్షేమాభివృద్ధికి కృషి చేశా..13న జరిగే ఎన్నికల్లో తాను గెలుపొందితే ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తానని ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి అన్నారు.2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రెండేళ్లపాటు కరోనా కష్టకాలం, మిగిలిన మూడేళ్లలో నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేశామని అన్నారు. చేసిన అభివృద్ధిని చూడలేని పయ్యావుల కేశవ్.. చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని అన్నారు. నియోజకవర్గంలో పదివేల మందికి ఇళ్లపట్టాలు అందించామని, ఒక్క ఉరవకొండలోనే 3,200 ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించామన్నారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నియోజకవర్గంలో రూ.5 కోట్లు అందించామని శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సాక్షి: ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకొస్తుందా?

విశ్వ: ఉరవకొండలో ఈసారి కచ్చితంగా గెలుస్తా. వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తాం. ఎన్నికల ప్రచారానికి ఏగ్రామానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజలు నాపై విశ్వాసం ఉంచారు. వైఎస్సార్‌సీపీ కూడా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. గెలిచిన వెంటనే నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ పరిష్కరిస్తాం. ఉరవకొండలో తాగునీటి సమస్య పరిష్కరించి, బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తా. హంద్రీనీవా ద్వారా నియోజకవరలో ఆయకట్టుకు నీరు అందించి, రైతులను ఆదుకుంటాం. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాకు ఒక ప్రణాళిక ఉంది.

సాక్షి: ఐదేళ్లలో కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారు?

విశ్వ: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తాను ఎమ్మెల్యేగా గెలవకపోయినా, ప్రజల పక్షాన నిలిచా. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా రూ. 2,500 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. దీంతోపాటు మరో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇందులో ఒక్క ఉరవకొండలోనే సీసీ రోడ్లుకు రూ.10 కోట్లు వెచ్చించాం. రూ.15 కోట్లు తాగునీటి పైప్‌లైన్ పనులకు కేటాయించాం. ఈపనులు జరగకుండా కేశవ్ అడ్డుకోవడంతో తాత్కలికంగా ఆగిపోయాయి.

సాక్షి: టీడీపీలో హత్యా రాజకీయాలపై మీరేం చెబుతారు?

విశ్వ: టీడీపీ హయాంలో హత్యా రాజకీయాలను ఎమ్మెల్యే పయ్యావుల కుటుంబం ప్రోత్సహించింది. దీంతో అనేక హత్యలు, దౌర్జన్యాలు జరిగాయి. పోలీసు స్టేషన్ పక్కనే ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద పయ్యావుల అనుచరులే ఒకరిని దారుణంగా హత్య చేశారు.

సాక్షి: టీడీపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఎలా ఎదుర్కొన్నారు?

విశ్వ: ఈ ఎన్నికల్లో కచ్చితంగా ఓడిపోతామన్న భయం టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఉంది. దీంతో కేశవ్ అధికారులు, ఉద్యోగులను బెదిరిస్తూ, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేయిస్తున్నాడు. చిరు ఉద్యోగులపైనా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించాడు. వేధింపులకు గురి చేస్తున్నారు. ధర్మం మా వైపు ఉంది కాబట్టే కచ్చితంగా గెలుస్తామన్న ధీమా ఉంది.